క్లుప్తంగా

ఉత్సాహంగా వేసవి శిబిరాలు



గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పిస్తున్న వెంకటేశ్వరరావు

పెద్దాపురం: ప్రతి సబ్జెక్టుపైన విద్యార్థులు పట్టు సాధించాలని కోటపాడు హెచ్ఎం ఆర్.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించారు. అలాగే వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహిస్తున్న పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) సమ్మర్ క్యాంప్‌ను నక్షత్ర దంత ఆస్పత్రి డాక్టర్ జమ్మి శిరీష సందర్శించి ప్రతీ విద్యార్థీ తమ దంతాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. దంత పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

రేపు పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సర్వ సభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన ఉంటుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఆయా మున్సిపల్ విభాగాల అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



యువతకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వైఆర్‌కే శ్రీనివాస్

కొత్తపల్లి: మత్తు పదార్థాలకు బానిసై యువత జీవితాలను చిన్నాభిన్నం చేసుకోవద్దని పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు అన్నారు. ఉప్పాడ- కాకినాడ బీచ్‌రోడ్డులో ఆదివారం పర్యటించారు. మత్తు పదార్థాల నివారణపై యువతకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రంక్‌అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల బంగారం లాంటి జీవితం నాశనమవుతుందని, అందరూ వాటికి దూరంగా ఉండాలని సూచించారు. తీరప్రాంతాల్లో సేద తీరే పర్యాటకులు జాగ్రత్తలను పాటించాలన్నారు. ఆయన వెంట ఎస్సై రామలింగేశ్వరావు ఉన్నారు.

ఫార్మసిస్టులకు సన్మానం

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ ఫార్మసిస్టు అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్వ సభ్య సమావేశం కాకినాడ ఎన్‌జీవో హోంలో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో జిల్లాలో పదోన్నతి పొందిన ఫార్మసీ సూపర్‌వైజర్, ఫార్మసిస్టు గ్రేడ్-1 పదోన్నతి పొందిన 28 మందిని సత్కరించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఎన్‌జీవో సంఘం పూర్వ అధ్యక్షుడు, విశ్రాంత ఫార్మసిస్టు బూరిగ ఆశీర్వాదం, జిల్లా ఎన్‌జీవో అధ్యక్షుడు గుద్దటి రామమోహన్‌రావు, జిల్లా కార్యదర్శి పి వెంకటకృష్ణ పదోన్నతి పొందిన ఫార్మసిస్టులను సత్కరించారు. కాంట్రాక్టు ఫార్మసిస్టుల రెగ్యులరైజేషన్ కోసం కృషి చేస్తామని ఎన్‌జీవో నాయకులు ప్రకటించారు. ఫార్మసిస్టుల జిల్లా కార్యదర్శి కె.చక్రధారి, కోశాధికారి వి.వెంకటస్వామి, అసోసియేషన్ అధ్యక్షులు కేవీ రమణమూర్తి, వై.పద్మమీనాక్షి పాల్గొన్నారు.

వర్ష బీభత్సం

- నేలకొరిగిన విద్యుత్తు స్తంభాలు
- తెగిపడిన విద్యుత్తు వైర్లు
- కూకటి వేళ్లతో కూలిన చెట్లు
- చెరువులుగా మారిన రహదారులు

సామర్లకోట: ఉష్ణతాపంతో ప్రజలు అల్లాడుతున్న వేళ ఆదివారం ఈదురుగాలులతో ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి పట్టణం అతలాకుతలమైపోయింది. స్థానిక స్టేట్‌బ్యాంకు వద్ద మూడు విద్యుత్ స్తంభాలు ఒరిగి పావడంతో వైర్లు తెగిపోయాయి. పెద్దాపురం రోడ్డు, అయోధ్యరామపురం, అంబటివారి వీధి, సత్యనారాయణపురంలలో విద్యుత్తు వైర్లపై చెట్లు పడ్డాయి. ఫ్లైఓవర్ బ్రిడ్జి సత్యనారాయణ పురం వద్ద విద్యుత్తు వైర్లపై చెట్టు పడడంతో వైర్లు కిందికి దిగిపోయాయి. దాంతో సామర్లకోట-పెద్దాపురం ఏడీబీ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పాండవుల మెట్ట నుంచి వాహనాలను పెద్దాపురం మీదుగా మళ్లించారు. సుమారు 3 గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. సీఐ కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సైలు అడపా గరగారావు, సునీత, ఏఎస్సై రత్నం, తమ సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సోమవారం ఉదయం వరకు విద్యుత్తు సరఫరా వచ్చే అవకాశం లేదని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. వర్షపునీటితో బస్ కాంప్లెక్స్ చెరువుగా మారింది. రైల్వే స్టేషన్, స్టేషన్‌సెంటర్, పెద్దాపురం రోడ్డు, సత్యనారాయణపురం, శెట్టిబలిజపేట, వెలమపేట, సాయినగర్, భాస్కర్‌నగర్, సీతారామకాలనీలు నీట మునిగాయి. రోడ్లు చెరువులుగా మారాయి. స్థానిక గాంధీచౌక్ వద్ద చెట్లు పడి రైల్వే విద్యుత్ లైన్లు తెగిపోయాయి. దీంతో విశాఖ వైపు వెళ్లే రైళ్లకు అంతరాయం ఏర్పడింది. రైల్వే అధికారులు హుటాహుటిన చెట్లను తొలగించి విద్యుత్తు వైర్లను పునరుద్ధరించారు. కెనాల్ రోడ్డులో వేట్లపాలెం వద్ద భారీ వృక్షం రోడ్డుపై పడి రాక పోకలు నిలిచిపాయాయి. కెనాల్ రోడ్డుకు మరో మార్గం లేక పోవడంతో చిన్న వాహన చోదకులు గోదావరి కాలువ గట్టు మీదుగా రాకపోకలు సాగించారు.



పెద్దాపురం ఫ్లీడర్స్ వీధిలో వర్షపు నీటిలో వాహనాల రాకపోకలు



పెద్దాపురం-ప్రత్తిపాడు రహదారిలో కూలిన చెట్టు కొమ్మలు కోసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న స్థానికులు

వీధులన్నీ జలమయం

పెద్దాపురం: అకాలవర్షంతో పెద్దాపురం పట్టణ, గ్రామాల్లోని వీధులు జలమయయ్యాయి. సుమారు గంటకు పైగా కురిసిన వర్షానికి మురికివాడలు, రూరల్‌లోని ఆయా గ్రామాల్లో రోడ్లు జలమయ్యాయి. దీంతో డ్రైన్లలోని మురుగు రోడ్లపైకి వచ్చి అధ్వానంగా తయారైంది. మున్సిపల్ సెంటర్, ఫ్లీడర్స్ వీధి, కబడ్డీ వీధి, నాయీ బ్రాహ్మణ కాలనీ, గోలి వారి వీధి, శివాలయం వీధి, మెయిన్‌రోడ్డుతో పాటు పలు మురికివాడల్లో రహదారులపై మురుగు పారడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఈదురు గాలులకు చాలా ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అలాగే పులిమేరు గ్రామంలో ఓ ఇంటిపై భారీ వృక్షం పడి, ఆ ఇంటిలో ఉంటున్న పట్టాభికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అకాల వర్షంతో సేద తీరిన ప్రజలు

కొత్తపల్లి: భానుడు ప్రతాపానికి ఆదివారం ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. 43 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా మార్పు చెంది మబ్బులు కమ్ముకున్నాయి. వర్షంతో వాతావరణం చల్లబడి ప్రజలు సేదతీరారు.

ఉపశమనం పొందిన ప్రజలు

పిఠాపురం: మండే సూరీడు మాయమయ్యాడు. అనుకోని అతిథిగా అకాల వర్షం విరుచుకుపడింది. అపసోపాలకు గురైన జనం ఈదురుగాలుల బీభత్సానికి హడలిపోయారు. గత వారం రోజులుగా సూరీడు నిప్పులు చెరగడంతో ఇళ్లకే పరిమితమైన జనం ఆదివారం కురిసిన వర్షంతో కాస్త ఉపశమనం పొందారు. ఆదివారం సాయంత్రం ఒక్క సారిగా వాతావరణంలో మార్పులు వచ్చి మెరుపులు ఉరుములతో పాటు భారీ ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో పలు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పిఠాపురం నియోజకవర్గంలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. పలు రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు నేల కూలాయి. దీంతో ఆయా రహదారుల్లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



దర్గా సెంటర్‌లో నేలకొరిగిన వృక్షం



గొల్లప్రోలు-చెందుర్తి రోడ్డులో విరిగిపడిన చెట్లు



చెందుర్తి పొలాల్లో నేల కొరిగిన విద్యుత్ స్తంభం

వైఎస్సార్ బీమా అందజేత



కొండయ్య కుటుంబానికి సొమ్ము అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ఉప్పాడ శివారు సుబ్బంపేటకు చెందిన ఎరిపల్లి కొండయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం అతని కుటుంబానికి ప్రభుత్వం అందించిన వైఎస్సార్ బీమా మొదటి విడత రూ.10 వేలను మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ బుజ్జిబాబు, సూరాడ నాగేశ్వరావు, మేరుగు బుజ్జమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు వందనం

కొత్తపల్లి: స్థానికంగా ఉన్న వీవీఎస్ ఆడిటోరియంలో ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ అబ్రహం లింకన్ తెలిపారు. వలంటీర్లకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు చేతుల మీదుగా అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు.

నమ్ముకున్న వారికి స్పష్టత ఇవ్వండి

- పవన్‌కు ద్వారంపూడి సలహా

కాకినాడ: వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే స్థానాలపై జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. అన్ని స్థానాలకు పోటీ చేస్తారో, పొత్తులతో వెళతారో స్పష్టత లేకపోవడం వల్ల రాష్ట్రంలో జనసేనను నమ్ముకున్న ఎంతోమంది నేతలు రాజకీయాలపై ఆసక్తితో సొంత సొమ్మును ఖర్చు చేస్తున్నారని అన్నారు. చివరకు పవన్‌కళ్యాణ్ పొత్తులు పెట్టుకుని వాళ్లందరికీ మొండి చేయి చూపించే పరిస్థితి కనిపిస్తోందని, అదే జరిగితే వాళ్లంతా ఆర్థికంగా దివాలా తీసే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఆదివారం ఆయన తన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడుతూ పొత్తులతోనే ఎన్నికలకు వెళతానని ఇప్పటికే కొంతమేరకు స్పష్టతనిచ్చిన పవన్ పోటీ చేసే స్థానాలపై కూడా స్పష్టత ఇవ్వాలని అన్నారు. అలా చేయడం వల్ల ఎంతోమందికి ఊరటను ఇచ్చిన వారవుతారని చెప్పారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

సామర్లకోట: యుక్త వయసు బాలికలు, మహిళల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. మహిళా ఆరోగ్య సదస్సులను ఆదివారం ఆయా ప్రాంతాలలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సదస్సుల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని కిశోర బాలికలు, గర్భిణులు ఆయా వార్డుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత, శానిటరీ ఇన్‌స్పెక్టరు పి.శ్రీనివాసరావు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, సీఆర్పీలు, హెల్త్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, ఏరియా ఆసుపత్రి వైద్యులు ఎస్.సుదీప్తి, జగదాంబ అన్నారు. పట్టణంలోని మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ రుతుస్రావ, పరిశుభ్రతా వారోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మెప్మా సీఎంఎం వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో చైర్‌పర్సన్ ఆరోగ్య సలహాలు ఇచ్చారు. తొలుత స్థానిక మున్సిపల్ సెంటర్‌లో ఆమె ర్యాలీని ప్రారంభించారు. మహిళలు మానవహారంగా ఏర్పడి ఆరోగ్య సూత్రాలను నినదించారు. మెప్మా సీఓలు సల్మా, శ్రీదేవి, ఏఎస్‌ఎంలు బేబీ, ముంతాజ్, సూర్య చంద్ర ఆర్‌పీలతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తదితరులు



మున్సిపల్ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

సొంతింటి కలను నెరవేర్చిన సీఎం జగన్

- పేదలను చులకనగా చూస్తున్న చంద్రబాబు
- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

పిఠాపురం: నిలువ నీడ లేని పేద వారికి సెంటు భూమి కొనడమంటే పెద్ద ఆర్థిక భారం మోయడమే.. అటువంటిది సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వారికి సెంటు భూమి ఉచితంగా ఇచ్చి సొంతింటి కలను నెరవేర్చారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ఆదివారం పిఠాపురం 21వ వార్డు జగ్గయ్య చెరువు కాలనీలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులో పర్యటించిన ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల వల్ల పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం కాలనీ వాసుల సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలంపై టీడీపీ అధినేత చంద్రబాబు అత్యంత నీచంగా మాట్లాడారన్నారు. ఆయన హయాంలో పేదలకు ఒక్క అరసెంటు భూమి కూడా ఇవ్వలేదు గాని ఇప్పుడు లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తే సంతోషించాల్సింది పోయి.. విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నిరు పేదల ఆశల హరివిల్లులైన ఇళ్ల స్థలాలను శ్మశాన వాటికలుగా పోల్చిన చంద్రబాబు పేదలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలం సెంటు భూమి కేవలం శవాలను కప్పెట్టడానికే సరిపోతుందంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. శవాలపై పేలాలు ఏరుకునే వాళ్ల ఎంత పెద్ద పదవులు చేసినా వారి బుద్ధి మారదని అందుకే చంద్రబాబు తన బుద్ధిని బహిర్గతం చేశారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక నోటికొచ్చిన మాటాలు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. పేదలపై చంద్రబాబు వ్యాఖ్యలు అప్రజాస్వామికం, అహంకార పూరితమన్నారు. అలాంటి మాటలు మాట్లాడిన బాబుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, బాలిపల్లి రాంబాబు, ఉలవల భూషణం, కౌన్సిలర్లు కావాడ పూసయ్య, చింతాడ నీలవేణి, బండి రవి అధికారులు, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



జగ్గయ్య చెరువులో స్థానికులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు, స్థానిక నాయకులు

పిఠాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడి మృతి

పిఠాపురం: స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షుడు గ్రంధి మంగరాజు(56) ఆదివారం మృతి చెందినట్టు ఆయన బంధువులు తెలిపారు. ఆయన గత 14 ఏళ్లుగా పిఠాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షుడిగా సేవలందించారు. ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకుడిగా వెండి బంగారు డైమండ్స్ వర్తక సంఘం నాయకుడిగా పని చేశారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో వైద్య సేవలు పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయన మృతికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ ఎంపీ వంగా గీత, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తదితరులు సంతాపం తెలియజేశారు.



గ్రంధి మంగరాజు

గొయ్యి పూడ్చరూ..

కొత్తపల్లి: ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఇరువైపులా డ్రైన్లు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో వర్షపు నీరు నిలిచిపోవడంతో గొయ్యి ఏర్పడింది. దీని కారణంగా మూలపేట వైపునకు వెళ్లే వాహనాలు మలుపు తిరిగినప్పుడు ప్రమాదాలకు గురవుతున్నాయి. భారీ వాహనాలు వెళ్లే సమయంలో రాళ్లు పడిపోతుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీచ్‌రోడ్డులో ఏర్పడిన గొయ్యిని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

నిప్పుల కలిమి

- కొలిమి జ్వలిస్తేనే పూట గడిచేది
- మండే ఎండయినా తప్పని పని
- యాంత్రీకరణతో పోటీ పడుతూ పనిముట్ల తయారీ



కొలిమి వద్ద పనిముట్లు తయారుచేస్తున్న పనివారు



విక్రయానికి సిద్ధంగా ఉన్న పరికరాలు



పనిముట్లు తయారీకి ఇనుము ముక్కను సమ్మెటతో కొడుతున్న కమ్మర్లు

సామర్లకోట: కమ్మరి సామగ్రి తయారీకి పెట్టింది పేరు సామర్లకోట. వ్యవసాయ పనిముట్లకు అవసరమైన పరికరాల తయారీలో చేయి తిరిగిన నిపుణులైన కార్మికులు ఇక్కడ ఉన్నారు. సుమారు 30 కుటుంబాలు ఈ పనిలో నిమగ్నమై ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి ప్రజలు సామర్లకోట వచ్చి వ్యవసాయ పరికరాలతో పాటు ఇళ్లలో ఉపయోగించే వంట సామగ్రి కొనుగోలు చేస్తుంటారు. సార్వా సీజన్ ప్రారంభం కావడంతో కమ్మర్లు తయారు చేసే వస్తువులకు గిరాకీ ఉంటుంది. దాంతో మండే ఎండైనా లెక్క చేయక నిప్పుల కొలిమి సమీపంగా ఉంటూ ఎంతో కష్టించి పని చేస్తుంటారు. నిప్పుల కొలిమి జ్వలిస్తేనే కలిమి లేకుంటే పస్తులేనని కార్మికులు అంటున్నారు

ఇనుప ముక్కలను బొగ్గుల కొలిమిలో ఉంచి కాల్చి, దానిని కావలసిన ఆకారంలో వస్తువు తయారుచేస్తారు. బొగ్గులను నిప్పులుగా తయారు చేయడానికి ఒకరు, ఇనుప ముక్కలను బొగ్గులలో ఉంచడానికి మరొకరు, ఎర్రగా కాలిన ఆ ఇనుము ముక్కలను సుత్తి, సమ్మెటలతో కొట్టడానికి మరొకరు పని చేస్తూ ఉంటారు. ఉదయం నుంచి రాత్రి వరకు అలసిపోయి పనిముట్లు తయారు చేసినా ప్రస్తుత పరిస్థితులలో రోజు కూలి కూడా రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనిముట్లకు అవసరమైన కత్తులు, గొడ్డళ్లు, కొడవళ్లు, తవ్వుగళ్లతోపాటు వంట సామాగ్రికి ఉపయోగించే అట్ల రేకులు, పెనాలు, అట్లకాడల వంటి పరికరాలను వీరు ఎంతో నైపుణ్యంతో నాణ్యంగా తయారు చేస్తారు. పాత ఇనుముతో పాటు కొత్త ఇనుముతోను వస్తువులు తయారు చేస్తారు. విశాఖపట్నం నుంచి టన్ను ఇనుము రూ.85 వేల నుంచి 90 వేల వరకు ఖర్చు చేసి కొనుగోలు చేస్తున్నారు.

యంత్రాలతో తట్టుకోలేని పోటీ



వివిధ రకాల యంత్రాలతో తయారుచేసిన వ్యవసాయ పనిముట్లు తక్కువ ధరలకు మార్కెట్టులో లభ్యమవుతున్నాయి. యంత్రాలతో వస్తువులు తయారు చేసుకోవడానికి అవసరమైన పెట్టుబడి తమకు లేకపోవడం, బ్యాంకులు తమకు రుణాలు ఇవ్వడానికి ముందుకు రాకపోవడం వల్ల కులవృత్తిగా ఒకే రకమైన జీవితాలను గడుపుతున్నాం. ఉపాధి కూలీ పనులకు ఉపయోగించే పారలు. గునపాల తయారీకి తమకు ఆర్డర్లు ఇవ్వాలి. తాటికమ్మ బొగ్గులను బస్తా రూ.600లకు కొనుగోలు చేస్తున్నాం. చేయూత పథకం కొంత మేరకు ఉపశమనం కలిగిస్తోంది. వ్యాపారాలు చేసుకొనే వారికి రుణాలు ఇచ్చే ఏర్పాట్లు చేయాలి.

– సారంపాటి లోవాచారి, కమ్మరి కార్మికుడు, సామర్లకోట